



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
బుధవారం 8 అక్టోబర్ 2025 పేజీలు 8


# త్వరలో ఊరూవాడా స్వచ్ఛ సేవక్ దళాలు!




- గౌరవ సీఎం ఆశయాలకు అనుగుణంగా ఏర్పాటుచేస్తాం
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రను మరింత ముందుకు తీసుకెళ్తాం
- త్వరలో విజయవాడ కెనాల్ నెట్‌వర్క్‌లో వాటర్ ట్యాక్సీలు
- అవార్డు పొందిన ప్రతిఒక్కరూ స్వచ్ఛాంధ్రకు బ్రాండ్ అంబాసిడర్
- సమిష్టి కృషితో స్వచ్ఛతలో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలుపుదాం
- సమర్థ అధికారుల కృషి ఫలితమే అన్ని రంగాల్లో ఎన్టీఆర్ జిల్లాకు అగ్రస్థానం!
- రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

**ఎన్టీఆర్ జిల్లా, అక్టోబర్ 7, మేజర్ న్యూస్ :** స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రి జై స్వచ్ఛ సేవక్ నినాదాన్ని ఇచ్చారని.. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛ సేవక్ దళాల ఏర్పాటుకు కృషిచేయనున్నట్లు రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. మంగళవారం నగరంలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జిల్లాస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తొలుత అతిథులు.. స్వచ్ఛతా వారియర్స్‌తో కలిసి మహాత్మాగాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

మిగతా 2లో



## ఆంధ్రా వాడికి తెలంగాణలో అరుదైన బిరుదు

కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ : ఈవెంట్ మేనేజరుగా తన ప్రస్థానం మొదలు పెట్టిన రవి కిరణ్ ప్రస్తుతం అనేక ఆదర్శ పనులకు శ్రీకారం చుట్టి అందరి చేత శెభాష్ అనిపించుకున్నారు.అనేక మందికి ఉపాధి కల్పిస్తూ,సమాజంలో పేదవారికి, అనాథలకు నిత్యం ఏదో ఒక సహాయం చేస్తూ మానవత్వాన్ని చాటుతున్నాడు.ముత్యాల రవి కిరణ్ సొంత గ్రామం ఒకప్పుడు మన కృష్ణాజిల్లా కు చేందిన సంఘర్షణ పురం.పొట్టకూటి కి ఒకప్పటి రాజధాని అయిన హైదరాబాద్ కు వలస వెళ్ళిన రవి కిరణ్ అంచెలంచెలుగా కష్టపడి నేడు ప్రతిష్టాత్మకమైన గాంధీ పీస్ అవార్డు గ్రహీతగా కీర్తిని ఘటించారు. నిరుపేద స్థితి నుండి శ్రమించి సమాజంలో అనేకమంది అభాగ్యులకు ఆసరాగా అండగా నిలిచిన ముత్యాల రవి కిరణ్ ను అవార్డు తో సత్కరించారు.

## సమిష్టి కృషితోనే సంబరాలు విజయవంతం





- దసరా మహోత్సవ యజ్ఞంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు, ధన్యవాదములు : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ
- ఒక అద్భుత ఘట్టం ముగిసింది: సీపీ రాజశేఖర్ బాబు
- కృష్ణానదికి రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసిన తరుణంలో నిర్వహించిన ఈ దసరా ఓ కేస్ స్టడీ : వీఎంసీ కమిషనర్ ధ్యాన చంద్ర
- దసరా మహోత్సవాల ప్రశాంత నిర్వహణపై జిల్లా యంత్రాంగానికి అభినందనలు
- అధికారులకు ప్రశంసాపత్రాల అందజేత

వివరాలు 2లో...

పేద విద్యార్థులకు మెరుగైన వైద్యం, విద్య..

## పేదలకు నాణ్యమైన వైద్యం మా లక్ష్యం



- మెడికల్ కాలేజీల పేరుతో జగన్ రెడ్డి పిచ్చి ప్రేలాపనలు సిగ్గుచేటు
- ఎన్ఆర్ఐ, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా ప్రకటించిన దుర్మార్గుడు జగన్ రెడ్డి
- 17 మెడికల్ కాలేజీల్లో ఎన్ని పూర్తి చేశావో సమాధానం చెప్పాలి
- కేంద్రం నిధులు తప్ప రాష్ట్రం నుండి పైసా ఖర్చు చేయలేదు
- కూటమి వచ్చాక మెడికల్ కాలేజీల పనులు వేగవంతమయ్యాయన్న మంత్రి కొల్లు రవీంద్ర

2లో..

గృహ నిర్మాణాల పురోగతిపై

## నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ 2



# త్వరలో ఊరూవాడా స్వచ్ఛ సేవక్ దళాలు!

(మొదటిపేజీ తరువాయి)

పట్టాభిరామ్‌తో పాటు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖ రబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం తదితరులతో కలిసి 50 మంది విజేతలకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో గౌరవ సీఎం ఆలోచనలకు అనుగుణంగా స్వచ్ఛాంధ్ర పురస్కారాలు అందజేస్తున్నామని తెలిపారు. నేడు పురస్కారాలు అందుకుంటున్న ప్రతిఒక్కరూ స్వచ్ఛాంధ్రకు బ్రాండ్ అంబాసిడర్లని.. సమష్టి కృషితో స్వచ్ఛాంధ్ర ఉద్యమాన్ని ముందుకుతీసుకెళ్లి రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలుపుదామని పిలుపునిచ్చారు. అత్యంత పారదర్శకంగా రాష్ట్ర స్థాయిలో 69 అవార్డులు, జిల్లా స్థాయిలో 1,257 అవార్డులను వివిధ కేటగిరీల్లో అందించినట్లు పట్టాభి తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలో సమర్థవంతమైన, నిబద్ధత కలిగిన అధికారుల వల్లే ఎన్‌టీఆర్ జిల్లాకు అత్యధిక అవార్డులు లభించాయని.. పేరుకు తగ్గట్లు ఎన్‌టీఆర్ జిల్లా అన్ని అంశాల్లోనూ ముందుండేందుకు తమ భాగస్వామ్యం ఉంటుందన్నారు. విజయవాడలో అద్భుతమైన కెనాల్ నెట్‌వర్క్ ఉందని.. మైక్రో ఎస్‌టీపీల ద్వారా శుద్ధిచేసిన నీరు కాల్వలులోకి వెళ్లేలా చేస్తే త్వరలోనే వాటర్ ట్యాక్సీల ఏర్పాటు సాకారమవుతుందని పేర్కొన్నారు. వాటర్ ట్యాక్సీల వల్ల రోడ్లపై ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. త్వరలో గ్రామాలకు 12 వేల ట్రై సైకిళ్లు అందిస్తామని, 1,600 ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేయనున్నామని.. శుభ్రంచేసిన డంపింగ్ యార్డులను హరిత స్థలాలుగా అభివృద్ధి చేయనున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు.

**ఓ చిన్న పిలుపు.. పెద్ద మార్పునకు నాంది: కలెక్టర్ లక్ష్మీశ**

ఓ చిన్న పిలుపు, సంకల్పం.. పెద్ద మార్పునకు నాంది అవుతుందని.. అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితో జిల్లా స్వచ్ఛాంధ్రలో ముందంజలో నిలిచిందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇచ్చాయన్నారు. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి స్వచ్ఛాంధ్ర కీలకమని పేర్కొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి ఇచ్చిన జై స్వచ్ఛ సేవక్ నినాదం స్ఫూర్తిగా ఇకపైనా జిల్లాను స్వచ్ఛతలో నెం.1గా నిలిపేందుకు కృషిచేద్దామని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. గౌరవ ఇన్‌ఛార్జ్ మంత్రివర్యులు, గౌరవ ఎంపీ తరఫున కూడా విజేతలకు అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

**డ్రోన్, ఏఐ సాంకేతికత అనుసంధానంతో మంచి ఫలితాలు**
**సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు**

స్వచ్ఛాంధ్రను విజయవంతంగా ముందుకుతీసుకెళ్లేందుకు ప్రభుత్వం వినూత్న విధానాలను అనుసరిస్తోందని.. జిల్లాకు 8 రాష్ట్ర, 50 జిల్లాస్థాయి అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. పోలీస్ కమిషనరేట్‌కు కూడా పురస్కారం రావడం చాలా సంతోషమన్నారు. వినూత్న విధానాల అమలుతో దసరా ఉత్సవాలను విజయవంతం చేశామని.. స్వర్ణాంధ్ర సాకారానికి అవసరమైన కీలక ప్రగతి సూచికల (కేపీఐ)లో పురోగతిని ఎప్పటికప్పుడు మదించేందుకు డ్రోన్, ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. నగరంలో వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు కూడా తమ శాఖ కీలక భాగస్వామ్యం అందిస్తుందని సీపీ రాజశేఖరబాబు తెలిపారు.

**స్వచ్ఛాంధ్ర పురస్కారాలతో ఆరోగ్యకర పోటీ**
**వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం**

స్వచ్ఛాంధ్ర పురస్కారాలతో స్వచ్ఛత, పరిశుభ్రత విషయంలో గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల మధ్య ఆరోగ్యకర పోటీ వాతావరణం నెలకొంటుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం అన్నారు. శాస్త్రీయ విధానాలతో డేటా విశ్లేషణతో అవార్డులకు విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపారు. అత్యుత్తమ విధానాలను పరస్పరం తెలుసుకొని అమలుచేసేందుకు కూడా ఈ అవార్డులు దోహదం చేస్తాయన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని.. ఏటా స్వచ్ఛాంధ్ర పురస్కారాల్లో జిల్లాను నగరాన్ని ముందు నిలిపేందుకు సమష్టిగా కృషిచేద్దామని ధ్యానచంద్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్స్ బి.భూషణం, బి.సౌభాగ్యం, శంకర్ తమ మనోగతాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కేజీవీ సరిత, జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీపీవో పి.లావణ్యకుమారి, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, పురస్కార విజేతలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితోనే సంబరాలు విజయవంతం

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** దసరా ఉత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహించడానికి కారకులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ధన్యవాదాలు తెలిపారు. దసరా నవరాత్రులను విజయవంతంగా ముగియడంపై అన్ని శాఖల అధికారులతో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ, నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, వియంసి కమిషనర్ ధ్యానచంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... తొక్కిసలాటలు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడంలో సఫలమయ్యామని చెప్పారు. ఈసారి దసరా 11 రోజులు నిర్వహించామని, భక్తులు గత సంవత్సరం కంటే అధికంగా, 16.5 లక్షలు వచ్చారని, అయినా ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి సమన్వయంతో దర్శన ఏర్పాట్లు చేసామని చెప్పారు. గత సంవత్సరం దసరా అనుభవాలతో నగర పోలీస్ కమిషనర్ ఒక పుస్తకం రూపొందించారని, ఇప్పుడు అన్ని శాఖల అభిప్రాయాలతో ఒక పుస్తకాన్ని రూపొందిస్తామని చెప్పారు. భవిష్యత్తులో దసరా నిర్వహణకు ఈ పుస్తకం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఫీడ్ బ్యాక్ ను లిఖితపూర్వకంగా తెలపవచ్చన్నారు. ఉత్సవాల సక్రమ నిర్వహణకు సహకరించిన అన్ని శాఖల అధికారులతోపాటు గుంటూరు, కృష్ణ జిల్లాల కలెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. విజయవాడ నగర కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ... ఈ సంవత్సరం దసరా ఉత్సవాలకు బందోబస్తు ఏర్పాటు చేయడం తన 27 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో ఎదుర్కొన్న అతిపెద్ద సవాలు అని చెప్పారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులతో పాటు, కార్నివాల్ కు వచ్చిన వారిని కూడా పరిగణనలోకి తీసుకుంటే 20 లక్షలు అవుతారని, ఇంతమందికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడడం సాధారణ విషయం కాదన్నారు. గత సంవత్సరం తొక్కిసలాట జరుగుతుందేమో అని కొన్ని సందర్భాల్లో భయపడ్డానని, ఈసారి అందుకు ఆస్కారం లేకుండా చక్కటి ప్రణాళికతో నిర్వహించామని తెలిపారు. ఎవరైనా నేరస్థులు వస్తున్నారా అనేది తెలుసుకోవడానికి 1,44,000 మంది ఫోటోలతో ఎఫ్ ఆర్ ఎస్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం వల్ల క్యూలైన్లు, పాసుల విషయంలో గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. రూ. 500, టికెట్లను తీసివేయటం సత్ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. పారిశుద్ధ్య సిబ్బంది, ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోలీసు సిబ్బంది కూడా అద్భుతంగా పనిచేశారని కితాబిచ్చారు. వియంసి కమిషనర్ ధ్యాన చంద్ర మాట్లాడుతూ.... జిల్లా కలెక్టర్ లక్ష్మీశ రోజులో మూడుసార్లు సాధారణ భక్తుడిగా క్యూలైన్లో వెళ్లి దర్శనం చేసుకున్నారని, పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని లోపాలు ఏవైనా ఉంటే వెంటనే సరిదిద్దు ఎందుకు వీలుగా ఒక కలెక్టర్ ఇన్నిసార్లు క్యూ లైన్ లో వెళ్లడం ఇదే మొదటిసారని చెప్పారు. పూర్తి సమన్వయం ఉంటే అద్భుతాలు జరుగుతాయనడానికి ఈ ఉత్సవాల నిర్వహణే నిదర్శనమన్నారు. రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసిన సమయంలో నిర్వహించిన ఈ దసరా ఒక కేస్ స్టడీగా నిలిచిపోతుందని చెప్పారు. డీసీపీ సరిత మాట్లాడుతూ... ప్రణాళిక, సన్నద్ధత, అమలు మూడూ సక్రమంగా జరగటం వల్లే ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. అన్ని శాఖల మధ్య చక్కటి సమన్వయం ఉండడానికి కలెక్టర్, సిపి, వియంసి కమిషనర్లు చేసిన కృషే కారణమన్నారు. దసరా మహోత్సవాలు విజయవంతం కావడానికి కృషిచేసిన అధికారులకు కలెక్టర్, పోలీస్ కమిషనర్, వి ఎం సి కమిషనర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కె.చైతన్య, కే.మాధురి, కే.బాలకృష్ణ, డిఆర్ఓ ఎం. లక్ష్మీ నరసింహ, అన్ని శాఖల జిల్లా అధికారులు, వియంసి సిబ్బంది పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాల పురోగతిపై నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలోని గృహ నిర్మాణాల పురోగతిపై నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ తో కలిసి గృహ నిర్మాణ పురోగతిపై ఎంపీడీవోలు,గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతి ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నెలకు కేవలం 2 లేదా 3 మాత్రమే పూర్తి చేస్తున్నారని ఇది ఎంత మాత్రం సరైనది కాదన్నారు. వచ్చే మార్చి 31వ తేదీ లోపు నిర్మాణాలను పూర్తి చేస్తేనే లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులు జరుగుతాయని, ఆ లోపుగా పూర్తి చేయకపోతే పథకం ముగింపు అవుతుందని ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాంట్రాక్టర్లు, లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి కృషి చేయాలని, అదేవిధంగా ప్రభుత్వం బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్న సంగతిని వివరించాలన్నారు. వెలుగు పథకం కింద కూడా అవసరమైన వారికి రుణాలు అందిస్తారని సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కలిగించాలన్నారు.జిల్లాలోని కొన్ని లేఔట్లను మెరక చేయవలసిన అవసరం ఉందని, దానివల్ల లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అలాంటి సమస్యలు ఉన్న లేఅవుట్ల వివరాలను నియోజకవర్గాల వారీగా అందించాలని అధికారులకు సూచించారు. ఈనెల 21వ తేదీన పురోగతిపై మరల సమీక్షిస్తామని, ఆ లోపుగా వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను ముందుకు తీసుకువెళ్లి పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు మెరుగైన వైద్యం విద్య.. పేదలకు నాణ్యమైన వైద్యం మా లక్ష్యం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడుతూ.ప్రజారోగ్యానికే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పేదలకు నాణ్యమై వైద్యం, పేద విద్యార్థులకు ఉచితంగా మెరుగైన వైద్య విద్య అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందే అన్న ఎన్టీఆర్, ఆతర్వాత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 28 మెడికల్ కాలేజీలు నిర్మించారు. పేదలకు వైద్య సదుపాయాలను చేరువ చేసే లక్ష్యంతో జీనోమ్ వ్యాలీ, మెడ్ టెక్ సిటీ ఘనత చంద్రబాబుదే. నిమ్స్,స్విమ్స్, బర్డ్‌ఆస్పత్రి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎవరు ఏర్పాటు చేశారో గుర్తు చేసుకోవాలన్నారు. కరోనాతో ప్రజల ప్రాణాలు పోతుంటే.బ్లీచింగ్ పౌడర్, పారాసిటమాల్ వేసుకుంటే సరిపోతుందన్నప్పుడే జగన్ రెడ్డికి ప్రజల ప్రాణాలంటే ఎంత చులకనో అర్థమైంది.17 మెడికల్ కాలేజీ గురించి మాట్లాడుతున్న జగన్ రెడ్డి.. వాటిలో ఎన్ని పూర్తి చేశారో సమాధానం చెప్పగలరా? ఆ కాలేజీలకు రాష్ట్రం ఇచ్చిన నిధులెంతో చూపించగలరా ? జగన్ రెడ్డి చెబుతున్న 17 మెడికల్ కాలేజీ కోసం రూ.1450 కోట్లు ఖర్చు చేస్తే అందులో ప్రతి రూపాయి కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చినవే. చివరికి పీజీ సీట్ల కోసం కేంద్రం ఇచ్చిన రూ.700కోట్లను కూడా తన ఖాతాలో వేసుకోవడం జగన్ రెడ్డి నీచ మనస్తత్వానికి నిదర్శనమన్నారు. మొత్తం మెడికల్ కాలేజీలు పూర్తవ్వాలంటే రూ.8450 కోట్లు అవసరం. రాష్ట్రం ప్రభుత్వం నుండి రూపాయి కూడా ఖర్చు చేయపోవడం వల్లనే ఒక్క కాలేజీ కూడా నిర్మాణానికి నోచుకోలేదు. మెడికల్ కాలేజీల గురించి మాట్లాడే జగన్ రెడ్డి.బందరు మెడికల్ కాలేజీకి రావాలని సవాల్ చేశారు. మూడు నాలుగు కాలేజీల్లో అరకొర పనులు చేసి బిల్లులు కొట్టేయడం తప్ప జగన్ రెడ్డి చేసిందేమీ లేదు.పాడేరు మెడికల్ కాలేజీలో 150 సీట్లు ఉంటే సదుపాయాలు లేక 50 సీట్లు మాత్రమే ఇవ్వాల్సి వచ్చింది. 15 శాతం ఎన్ఆర్ఐ కోటా, 35శాతం సెల్ఫ్ ఫైనాన్స్ కోటాగా నిర్ణయించినది ఎవరో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలి. కూటమ ప్రభుత్వం వచ్చాక పేదల ఆరోగ్యానికి, విద్యకు తొలి ప్రాధాన్యం ఇచ్చి నిర్మాణ పనుల్ని పూర్తి చేస్తున్నాం. పీపీపీ పద్ధతిలో నిర్మాణాలు పూర్తి చేసినా.జగన్ రెడ్డి తీసుకున్న విధానాల మేరకే సీట్ల కేటాయింపు ఉంటుందనేది విషయం గుర్తుచుకోవాలన్నారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలన్నీ పూర్తి చేసి 1750కి పైగా మెడికల్ సీట్లు విద్యార్థులకు అందిస్తామన్నారు. గత ఐదేళ్ల ఒక్క మెడికల్ కాలేజీ కూడా పూర్తి చేయకుండా.. ఇప్పుడు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థులకు మెడికల్ సీట్లు, పేదలకు మెరుగైన వైద్యం అందించాలని భావిస్తుంటే.. ధర్నాలు, రాస్తారోకోలు అంటూ రాద్ధాంతం చేస్తే ప్రజలు సహించరు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం. పెన్షన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి ఉచిత బస్సు, మెగా డీఎస్సీ,ఉచిత సిలిండర్ పథకాలను ప్రతి లబ్ధిదారునికి అందిస్తున్నాం. కూటమి పాలనకు వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక మెడికల్ కాలేజీల పేరుతో జగన్ రెడ్డి హడావుడి చేస్తున్నాడు. కమిషన్ల కోసం గంగవరం పోర్టు,



కోఆపరేటివ్ మిల్క్ ఫ్యాక్టరీలు ప్రైవేటు పరం చేసిన పాపం జగన్ రెడ్డిదే అన్నారు.మెడికల్ కాలేజీలను త్వరితగతిన పూర్తి చేయాలనుకుంటుంటే విమర్శలు చేయడానికి సిగ్గుపడాలన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాలతో దేశ విదేశాల్లో తెలుగు వారు తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. మెడికల్, ఇంజనీరింగ్, ఐటీ రంగాల్లో ప్రపంచాన్ని శాసించే శక్తులుగా మారారు.

**మద్యం గురించి మాట్లాడే అర్హత వైసీపీ నేతలకు లేదు**

మద్యం విషయంలో వైసీపీ నేతలు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. తాడేపల్లి ఖజానా నింపుకోవడం కోసం ప్రజల ప్రాణాలు హరించిన దుర్మార్గుడు జగన్ రెడ్డి. వారి మద్యం స్కాంలోని దొంగలంతా ఒక్కొక్కరుగా బయటపడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మెరుగైన మద్యం పాలసీ తీసుకొచ్చాం. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూనే ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా పాలసీ రూపొందించాం. అన్నమయ్య జిల్లాలో మద్యం కల్తీ గురించి మొట్టమొదట బయట పెట్టిందే ఎక్సైజ్ అధికారులు. తప్పు చేసిన వారిని ఇప్పటికే అరెస్టు చేశాం. తెలుగుదేశం పార్టీ నాయకుల పాత్ర ఉందని తెలిసిన వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేశాం. కఠినమైన సెక్షన్లతో కేసులు నమోదు చేశాం. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడాలనుకుంటే సహించేదే లేదని ముఖ్యమంత్రి ప్రకటించారు.సరిహద్దు రాష్ట్రాల్లో నిఘా పెంచడంతో పొరుగు మద్యం దిగుమతి తగ్గి మన ఆదాయం పెరిగింది. కలుగుల్లోంచి ఎలుకల్లా వచ్చి పిచ్చి వాగుడు వాగుతున్న వైసీపీ నాయకులు గత ఐదేళ్లు ఏం చేశారో.. ఇప్పుడేం జరుగుతోందో తెలుసుకోవాలి. తంబళ్లపల్లి ఘటన ముద్దాయికి చెందిన గోదాములో ఉన్న కల్తీ మద్యం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నాం. రాష్ట్రంలో మద్యం వ్యాపారం మొత్తం పారదర్శకంగా జరుగుతోంది. ప్రతి బాటిల్ తయారీ నుండి అమ్మకం వరకు ట్రాక్ చేస్తున్నాం. మద్యం భవిష్యత్ ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టిన దుర్మార్గం జగన్ రెడ్డిదే. నాటి దుర్మార్గాలు, పన్నుల కారణంగానే ధరల్లో వ్యత్యాసం ఉంది. బెల్టు షాపుల విషయంలో కూటమి ప్రభుత్వం కట్టుదిట్టంగా వ్యవహరిస్తోంది. ఎక్కడ ఎవరు తప్పు చేసినా క్షమించేది లేదు. నాటు సారా నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే రాష్ట్రాన్ని నాటు సారా రహితంగా మార్చామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

# నిస్సాన్ తాజా సి ఎస్యూవీ, నిస్సాన్ టెక్టన్ విడుదల







విజయవాడ మేజర్ న్యూస్ : నిస్సాన్ మోటార్ ఇండియా గ్లోబల్ ఎస్‌యూవీ లైనప్‌కు సరికొత్త ఎడిషన్ కోసం డిజైన్ యొక్క ప్రివ్యూ సరికొత్త నిస్సాన్ టెక్టన్ ను ఆవిష్కరించినట్టు నిస్సాన్ మోటార్ మేనేజింగ్ డైరెక్టర్ సౌరబ్ వాట్సా తెలిపారు. నిస్సాన్ ఆశయాన్ని ప్రతిబింబించే పేరు గా టెక్టన్ ఉంటుందన్నారు. ఇది నిస్సాన్ యొక్క ఖచ్చితమైన ఇంజనీరింగ్, జీవితాలను సుసంపన్నం చేసే ఆవిష్కరణల నీతితో సమం చేస్తుందని, ఈ పేరు శక్తివంతమైన, ప్రీమియం సి ఎస్‌యువిని సూచిస్తుందన్నారు. ఇది ఇంజనీరింగ్ ఎక్సలెన్స్, పనితీరు, విలక్షణమైన డిజైన్ గుర్తింపును కలిగి ఉంటుందన్నారు.

టెక్టన్ వారి కెరీర్లు, అభిరుచులు లేదా జీవనశైలి ద్వారా "వారి ప్రపంచాన్ని రూపొందిస్తున్న" వారికి ఎంపిక అవుతుందన్నారు. 2026 లో దాని పూర్తి ఆవిష్కరణ, అమ్మకాల ప్రారంభానికి ముందు, టెక్టన్ సి ఎస్యువి విభాగంగా రూపొందించబడిందన్నారు. ఇది నిస్సాన్ యొక్క 'వన్ కార్, వన్ వరల్డ్' స్ట్రాటజీ కింద రెండవ ఉత్పత్తి అవుతుందని, ఇది చెన్నై ప్లాంట్‌లో రెనాల్ట్‌తో కలిసి భారతదేశంలో అమ్మకానికి, ప్రపంచ మార్కెట్లను ఎన్నుకోవటానికి భవిష్యత్తు ఎగుమతి గా నిలుస్తుందన్నారు. డిజైన్, ప్రేరణ.. నిస్సాన్ యొక్క సరికొత్త ఎస్‌యూవీ, టెక్టన్, సంస్థ యొక్క ఎక్కువ కాలం నడుస్తున్న, అత్యంత ప్రసిద్ధ ఎస్‌యూవీ డిజైన్ ప్రేరణను పొందుతుందని చెప్పారు. నిస్సాన్ టెక్టన్ నిస్సాన్ యొక్క పునరుత్థాన కథకు కేంద్రంగా ఉండబోతోంది, దేశంలో మా ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో యొక్క భవిష్యత్తు గురించి ఒక సంగ్రహావలోకనం అందిస్తుందిదాని కమాండింగ్ వైఖరి, బోల్డ్ లుక్స్, ప్రీమియం ఇంటీరియర్‌లతో, ఇది ఒక సెగ్మెంట్ డిస్ట్రప్టర్‌గా ఉంటుందని మేము విశ్వసిస్తున్నాము అని అన్నారు.

# గీతా మందిరంలో ఘనంగా వాల్మీకి జయంతి



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బూరగడ్డ శ్రీనాథ్ పిలుపుమేరకు వాల్మీకి జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక గీతా మందిరంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు జరుపుకున్నారు. విశ్వహిందూ పరిషత్ కృష్ణాజిల్లా మఠమందిర్ సహ ప్రముఖ్ అన్నపరెడ్డి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తూర్పు ఆంధ్ర ప్రాంత సహ ప్రముఖ్ లింగం బసవ శంకర్రావు, అవనిగడ్డ ప్రఖండ అధ్యక్షులు కమ్మిలి సుబ్రహ్మణ్యేశ్వర రావు, అవనిగడ్డ ఖండ అధ్యక్షులు గరికిపాటి హరిబాబులు పాల్గొని వాల్మీకి జీవిత చరిత్ర వివరించారు వాల్మీకి జీవితంలో ఎన్నో అద్భుతమైన ఘట్టాలు జరిగాయని చెబుతూ గోదావరి పరివాహక ప్రాంతంలో బోయ సామాజిక వర్గంలో రత్నాకరుడుగా జన్మించిన వాల్మీకి. దొంగతనాలు, దోపిడీలు చేస్తూ జీవన సాగించేవాడని ఓ మహర్షి సూచనలు మేరకు దొంగతనాలు దోపిడీలు ద్వారా వచ్చిన ఆదాయాన్ని భార్యకు బిడ్డలకు ఇస్తున్నావు కదా నీవు చేసే పాపములో సగం వాళ్లు కూడా తీసుకుంటారేమో అడగమని చెప్పగా వాల్మీకి ఇంటి దగ్గరికి వెళ్లి అడగగా నీ పాపంతో మాకు ఏమి పని అనగా వెంటనే తిరిగివచ్చి మహర్షి చెప్పగా మహర్షి మరమరా అని మంత్రాన్ని ఉపదేశించగా మరమరా అంటూనే కాస్త రామా రామా అని మారి ధ్యానం చేయడం వలన బోయ రత్నాకరుడు పేరు కాస్త వాల్మీకి మహర్షిగా మారి రామాయణము రాసాదని వివరించారు. రామాయణాన్ని లవకుశల ద్వారా విశ్వవ్యాప్తం చెందిందని తెలిపారు. వాల్మీకి జయంతి ఉత్సవాలు జిల్లా కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలో పలుచోట్ల నిర్వహిస్తున్నారని అన్నపరెడ్డి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులైన బచ్చు శ్రీహరి, బాలు శ్రీనివాస్, విజయకుమార్ తోట ఆంజనేయులు పులిగడ్డ వెంకటేశ్వరరావు అద్దేపల్లి ప్రసాద్ బొప్పన సుభాష్ చంద్రబోస్ బొప్పన రమణ నాగాయలంక ఖండ అధ్యక్షుడు లంకె సీతా రామాంజనేయ వర్మ విశ్వహిందూ పరిషత్ సభ్యులు, హిందూ బంధువులు పాల్గొన్నారు.




## అంగలూరు బాలికల హైస్కూలుకు "స్వచ్ఛ పాఠశాల" అవార్డు

గుడ్లవల్లేరు అక్టోబరు 07 మేజర్ న్యూస్ : గుడ్లవల్లేరు మండలం, అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు జిల్లా స్థాయిలో స్వచ్ఛ పాఠశాల అవార్డు అందుకుంది. మచిలీపట్నంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. జగన్మోహనరావుకు స్వచ్ఛ పాఠశాల అవార్డును కృష్ణా జిల్లా ఇన్చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, ఎపిఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణల చేతులమీదుగా అందచేసారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో స్వచ్ఛ పాఠశాల అవార్డు అందుకున్న ప్రధానోపాధ్యాయులు, ఎంఇఓ-1 జి. జగన్మోహనరావుకు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అదేవిధంగా అవార్డుకు కృషిచేసిన, సహకరించిన ఉపాధ్యాయులకు, పాఠశాల సిబ్బందికి జగన్మోహనరావు కృతజ్ఞతలు తెలిపారు.

# దివిసీమ కీర్తి కిరీటం ఎంవీ కృష్ణారావు



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : దివిసీమ కీర్తి కిరీటం స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు అని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం స్థానిక వంతెన సెంటరులో దివిసీమ గాంధీ, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు కొనసాగుతున్నాయి. కృష్ణారావు విగ్రహానికి కోడూరు మండలం మాచవరం గ్రామ సర్పంచ్ అప్పికట్ల లక్ష్మి, టీడీపీ, జనసేన గ్రామ అధ్యక్షులు కూరాకుల శివయ్య, కూరాకుల చంద్రశేఖర్, జనసేన మండల ఉపాధ్యక్షులు రెడ్డౌతు కృష్ణబాబు, తెలుగు యువత మండల అధ్యక్షులు కూరాకుల శివప్రసాద్, కూరాకుల శేష కుమారి,గ్రామ కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎంపీగా, రాష్ట్ర మంత్రిగా రాష్ట్ర అభివృద్ధి, దివిసీమ ప్రగతికి కృష్ణారావు కృషి స్మరించుకున్నారు. మంత్రిగా విద్యా రంగంలో కృష్ణారావు అనేక సంస్కరణలు ప్రవేశపెట్టారని తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన ఉమ్మడి రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు కృష్ణకుమారి, మాచవరం గ్రామస్తులు అప్పికట్ల సుబ్రమణ్యం, కైతేపల్లి పానకాలు, అడపాల వేణు, నరహరిశెట్టి నాగేశ్వరరావు, విస్సంశెట్టి బాపనయ్య, రెడ్డౌతు సాంబయ్య, జరుగు లీలా అర్జున రావు (చిన్న బుజ్జి), కూరాకుల వాసుదేవ కృష్ణ, మింగు వెంకటేశ్వరరావు, రెడ్డౌతు శ్రీనివాస రావు, అప్పికట్ల శేషగిరి, రెడ్డౌతు సాయి, ముత్తిరెడ్డి అర్జునరావు, విసంశెట్టి గంగారావు, కోట చంద్ర, నరహరిశెట్టి మాణిక్యాలరావు, జరుగు కృష్ణారావు(మేస్త్రి), కూరాకుల సుబ్బారావు, పాలంకి ప్రసాద్, కొండవీటి శ్రీను, బచ్చు అర్జునరావు, జరుగు వెంకటరత్నం, జరుగు సత్యం, మండలి అభిమానులు పాల్గొన్నారు.

## గోద్రెజ్ ఆగ్రోవెట్ 'మై గ్రేసియా, మై ప్రైడ్' ప్రచారం




గుంటూరు మేజర్ న్యూస్ : భారతదేశంలోని ప్రముఖ విభిన్న వ్యవసాయ వ్యాపార సమ్మేళనాల్లో ఒకటైన గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఇటీవల వ్యవసాయ శ్రేయస్సును పెంచడానికి ఆరోగ్యకరమైన నారు మొక్కల ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ 'మై గ్రేసియా, మై ప్రైడ్' అనే పేరుతో దేశ వ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించింది. సరైన సమయంలో గ్రేసియా కీటకనాశినిని చురుకుగా ఉపయోగించడం వల్ల మిరప, క్యాబేజీ, టమాటో, వంకాయ, ఇతర పంటలలో తెగుళ్లను నియంత్రించడంలో దీర్ఘకాల వ్యవధి, సమర్థతను అందిస్తుంది వర్షానికి తట్టుకునే అద్భుతమైన శక్తిని కలిగి ఉంటుంది. ఈ ప్రచారంలో భాగంగా, రైతులను ప్రోత్సహించడానికి, ఉత్పత్తి ప్రామాణికతపై వారికి అవగాహన కల్పించడానికి కంపెనీ 'స్పిన్ అండ్ విన్' పోటీని కూడా ప్రవేశపెట్టిందని గోద్రెజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈఓ రాజవేలు ఎన్.కె తెలిపారు. గ్రేసియా ప్యాక్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఉత్పత్తి ప్రామాణికతను ధృవీకరించాలని, క్యాష్‌బ్యాక్ గెలుచుకునే అవకాశాన్ని పొందాలని రైతులను ప్రోత్సహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## రోహిత్ శర్మతో రాయల్ స్టాగ్ సెలబ్రేట్ లార్జ్ ఏఐ పవర్డ్ పండగ కాంపైన్




విజయవాడ మేజర్ న్యూస్ : యువత తమ విలక్షణమైన స్టైల్, ఉత్సాహాలను నింపుకోవడానికి రాబోయే సంవత్సరాల్లో గుర్తుండిపోయే జ్ఞాపకాలను సృష్టించడానికి, లివ్ ఇట్ లార్జ్‌గా ఉండటానికి రాయల్ స్టాగ్ ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ సెలబ్రేట్ లార్జ్ ఏఐ పవర్డ్ పండగ కాంపైన్ ప్రారంభించింది. ఈ ఏడాది కాంపైన్ సంస్కృతిలో లోతుగా పాతుకున్న టెక్-ఫార్వర్డ్, ఏఐ ఆధారిత అనుభవాన్ని రాయల్ స్టాగ్ ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ ఆవిష్కరిస్తుంది. బ్రాండ్ లివ్ ఇట్ లార్జ్ సిద్ధాంతంతో యువతరం కోరికను సాగసుగా అల్లుకుని వినియోగదారులను సంబరంలో ప్రధాన ఆకర్షణగా ఉంచుతుంది. రీజనరేటివ్ ఏఐ ఆధునిక స్వరం సంశ్లేషణలను ఉపయోగిస్తూ, రాయల్ స్టాగ్ కొత్త పండగ శుభాకాంక్షల అనుభవాన్ని అభిమానులు రోహిత్ శర్మతో పాటు వ్యక్తిగత వీడియో శుభాకాంక్షలతో సృష్టించవచ్చు. సహజమైన సంభాషణల రూపంలో రూపొందించబడిన, వినూత్నమైన, వాస్తవమైన శుభాకాంక్షలు పండగ కోరుకును కనక్షన్ క్షణంగా సెలబ్రేట్ లార్జ్ స్ఫూర్తి నిజమైన సూచనగా మారుస్తాయి.

## న్యాయమూర్తిపై దాడిని ఖండించిన గన్నవరం న్యాయవాదులు



గన్నవరం, అక్టోబర్ 7, మేజర్ న్యూస్ : భారత అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ పై జరిగిన దాడిని గన్నవరం న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయమూర్తిపై జరిగిన దాడి రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించాలన్నారు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అనుమోలు వెంకటేశ్వరరావు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపట్ల పాఠశాల విద్యార్థులకు అవగాహన



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ : కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో గుడివాడ డిఎస్పి ధీరజ్ వినీల్, రూరల్ సిఐ సోమేశ్వరరావు ఉత్తర్వులు మేరకు సైబర్ సెక్యూరిటీ అవేర్నెస్ మంత్ లో భాగంగా గుడ్లవల్లేరు ఎంపీపీ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్ వి వి సత్యనారాయణ నిర్వహించారు. సైబర్ సెక్యూరిటీ నేరాల యొక్క తీరును వివరిస్తూ వీడియోలు ప్రదర్శన చేశారు. దీనిలో భాగంగా మహిళల భద్రత రహదారి భద్రత నియమాలను, డయల్ 112, 1930 కూడా వివరించడం జరిగింది. కార్యక్రమంలో గుడ్లవల్లేరు పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా మల్లెల మహేష్ రెడ్డి ప్రథమ వర్ధంతి

**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** మంగళవారం రాణి గారి తోట 17వ డివిజన్ తెలుగుదేశం పార్టీ తెలుగు మహిళా అధ్యక్షురాలు మల్లెల కుమారి ఇంటి వద్ద కుమారుడు, మాజీ 192వ ఎన్నికల పోలింగ్ బూత్ కన్వీనర్ గా పని చేసిన కీ.శే. మల్లెల మహేష్ రెడ్డి మొదటి వర్ధంతికి విజయవాడ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామమోహన్ విచ్చేసి ఘన నివాళు లర్పించారు. ఎమ్మెల్యేతో పాటుగా, 17వ డివిజన్ ఎన్నికల పోలింగ్ బూత్ లు కన్వీనర్ ముని పోలిపల్లి, 17వ డివిజన్ టీడీపీ కార్యనిర్వాహణ కార్యదర్శి వేల్పుల శౌరి, 17వ డివిజన్ టిడిపి యువ నాయకుడు ముని కృష్ణ, 17వ డివిజన్ మైనార్టీ సెల్ నాయకులు ఎస్.కె మదర్ మొకర ఆదిబాబు, 17వ డివిజన్ టిడిపి బిసి సెల్ అధ్యక్షులు అవనాపు శ్రీను, 17వ డివిజన్ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వేల్పుల గురవయ్య, 17వ డివిజన్ టిడిపి సీని యర్ నాయకులు మూల వెంకటేశ్వరరావు(కొండ), బోని తమ్మినాయుడు, వేల్పుల్ విజయ్, నాగం కుమారి, వేల్పుల రాణి, కొప్పాల సూర్యవతి(సూ రీడమ్మ), తదితరులు పాల్గొని మహేష్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రెవెన్యూ కార్యాలయంలో వాల్మీకి జయంతివేడుకలు



**నాగాయలంక అక్టోబర్ 7 మేజర్ న్యూస్ :** నాగాయలంక మండలం నాగా యలంక గ్రామంలోని మండల రెవెన్యూ అధికారి వారి కార్యాలయంలో మంగళవారం వాల్మీకి జయంతి సందర్భంగా తాసిల్దార్ సిహెచ్ వీరాంజ నేయ ప్రసాద్ మండల తాసిల్దార్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి, పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించినవారు ఈ కార్యక్రమంలో సూపరిం డెంట్ డిప్యూటీ తాసిల్దార్ మండలి కేసవి సీనియర్ అసిస్టెంట్ సత్యనారా యణ, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ సాయిబాబు వీ ఆర్ ఏ లు ఆఫీస్, సిబ్బంది పాల్గొని శతజయంతి కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు.

## జాతీయస్థాయి పోటీలకు నాగాయలంక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ విద్యార్థినీల ఎంపిక



**నాగాయలంక అక్టోబర్ 7 మేజర్ న్యూస్ :** నాగాయలంక మండలం నాగా యలంక జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లస్ విద్యార్థినిలు ఈనెల 4వ తేదీ నుండి ఆరవ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా కృష్ణదేవరావుపేటలో 12వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్బాల్ పోటీలు జరిగినాయి వీటిలో నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ నాగాయలంక విద్యార్థిని గుంటూరు హాసిని, అద్భుత ప్రదర్శన కనబరిచి డిసెంబర్ నెలలో కర్ణాటకలో జరుగు జాతీయ స్థాయి సాఫ్ట్ వాల్ పోటీలకు ఎంపికైనది. ఈనెల నాలుగవ తేదీ నుండి 5వ తేదీ వరకు ఆంధ్ర ప్రదేశ్ కినోయిన్ కయా కింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ రాష్ట్రస్థాయి కినోయిన్ కయాకింగ్ పోటీలు కర్నూలు జిల్లాలో నాగలవరపు చెరువులో జరిగినాయి. వీటిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ నాగాయలంక విద్యార్థిని నాగిడి. అశ్వినీ, గోల్డ్ మెడల్స్ సాధించినది. వీరు త్వరలో మధ్యప్రదేశ్ లోని భోపాల్ లో జరిగే జాతీయ స్థాయి కెనోయిన్ కయాకింగ్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపా ధ్యాయులు అలపర్తి. సత్యనారాయణ తెలియజేసినారు అద్భుత ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన గుంటూరు హాసిని నాగిడి అశ్వినీ లను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గాజుల లక్ష్మీ ప్రసాద్ ఏఎంసీ చైర్మన్ ఒక్కపట్ల,లీలా మారుతి గ్రామ పెద్దలు అభినందించి నారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి




**ఏ కొండూరు, మేజర్ న్యూస్ :** ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ కమల మాట్లాడుతూ అన్ని రకాల సెలవులు ఇవ్వాలని ఫోన్లు,5జి సిమ్ములు, నాణ్యమైన యూనిఫామ్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా, ఎన్టీఆర్ జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ సెంటర్లు వద్ద, ఏ.పీ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో, ఆశ వర్కర్లు ధర్నాలు చేసి నిరసన తెలియజేసి అనంతరం డాక్టర్లకు వినతి పత్రం అందజేశారన్నారు.ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇస్తామని కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించారని ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తికావస్తున్న ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడం వలన, ఆశ వర్కర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె అన్నారు. అలాగే ఆశ వర్కర్లకు అనారోగ్యం వచ్చినప్పుడు సెలవులు లేకపోవడంతో, అధికారుల దయాదక్షిణ్యాల పై ఆధారపడాల్సి వస్తున్నది అని ఆమె ఆరోపించారు. పండగ సెలవులు, జాతీయ సెలవులు, క్యాజువల్ లీవులు, మెడికల్ లీవులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు, సిమ్ములు సరిగా పనిచేయకపోవడంతో సొంత నెట్ బాలన్స్ వేయించుకుని సర్వీస్ అందించాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే నాణ్యమైన ఫోన్లు 5జి సిమ్ములు ఇవ్వాలని ఆమె అన్నారు. ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులు చేయించరాదని, రికార్డులు రాయమని ఒత్తిడి చేయరాదని కమిషనర్ఇచ్చిన సర్కులర్,కిందిస్థాయిలో ఎక్కడ అమలు చేయకుండా,ఆశాలతో క్లీనింగ్ పనులు చేయించడం రికార్డులు రాయాల్సిందేనని ఒత్తిడి చేయటం జరుగుతుందని, అలా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.జనాభా కి అనుగుణంగా ఆశా వర్కర్లు ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఏఎన్ఎం, జీఎన్ఎమ్ ట్రైనింగ్ అయినా అర్హులైన ఆశ వర్కర్లకు ఖాళీ పోస్టుల భర్తీ చేసే క్రమంలో మొదటి ప్రాధాన్యత ఆశాలకు ఇవ్వాలని, ఆశాల నియామకాలను ప్రభుత్వమే చేపట్టాలని, అంత్యక్రియలకు 20వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో తమ పోరాటాన్ని దశలవారీగా ఉధృతం చేస్తారని హెచ్చరించారు. అలాగే సెప్టెంబర్ 26 నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే డాక్టర్లు తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్నారని,ఆ సమ్మెకు ఆశ వర్కర్స్ యూనియన్ గా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి పేద ప్రజలకు ఆరోగ్య సేవలు ఇబ్బంది లేకుండా డాక్టర్ల సమస్యలు పరిష్కారం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం 13 మందితోనూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా బి లక్ష్మీ పి. శ్రావణి, కోశాధికారిగా టి. శైలజ, ఉపాధ్యక్షులు వి యశోద సహాయ కార్యదర్శి ఎన్ రాజామణి తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా మహాసభలు కొండపల్లిలో అక్టోబర్ 12, 13 వ తేదీన జరుగుతున్నాయని, ఆ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

# గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు అండగా నిలవడం అభినందనీయమని పెదపారుపూడి ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దాతల సహకారంతో గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండల పరిధిలోని దూళ్ళవాని గూడెంలో లవ్ అండ్ కంపాషన్ మినిస్ట్రీ, క్రీస్తు సంఘం సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిర ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా అందిస్తున్న వైద్య శిబిరాలు ఆసరాగా నిలుస్తాయన్నారు. డాక్టర్ సుజిత్ ప్రేమ్ దగాని ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, బిపి, షుగర్ పరీక్షలు, దంత సమస్యలు, అన్ని రకాల దీర్ఘకాల




వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా ఉచితంగా అందజేశారు. అంతేకాక 15 రకాల నిత్యవసర సరుకులు అందించారు. పలువురు పేదలకు, వృద్ధులకు ప్రతినెలా పెన్షన్ అందజేస్తున్న సుజిత్ ప్రేమ్ సేవలు మరువలేని వని ఈ సందర్భంగా ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వంగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీ సంస్కరణలను విస్తృతంగా ప్రచారం చేయండి

### శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా

**పామర్రు మేజర్ న్యూస్ :** జీఎస్టీ సంస్కరణలను ప్రజల్లోనికి తీసుకువెళ్లి విస్తృతంగా వారికి అవగాహన కల్పించాలని శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా విజ్ఞప్తి చేశారు. పామర్రు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జీఎస్టీ పై మండలంలోని పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి జీఎస్టీ పై అవగాహన కలిగేలా నాయకులు గ్రామాలలో విస్తృతంగా పర్యటించాలని కోరారు. అలాగే కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గురించి కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న కారణంగా పార్టీకి చెందిన ప్రతి కార్యకర్త, నాయకుడు ప్రభుత్వ కార్యక్రమాలు పై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని, వారికి తగిన ప్రాధాన్యత లభిస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొంతమంది నాయకులు తమకు పదవులు లేవని ఆవేదన చెందుతున్నారని, పార్టీ కోసం కష్టపడి పని చేసే ప్రతి ఒక్క నాయకునికి పదవులు వచ్చేలా చూస్తానని ఈ సందర్భంగా



ఎమ్మెల్యే కుమార్ రాజా హామీ ఇచ్చారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రస్తుతం జీఎస్టీ పైన అవగాహన కల్పించడం తోపాటు ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను కూడా వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, పార్టీ సీనియర్ నాయకులు గొట్టిపాటి లక్ష్మీ దాసు, పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, సున్న రామాంజనేయులు, దాలిపర్తి ప్రసాద్ లతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాల్మీకి మహర్షి బోధనలు నేటి సమాజంలో విలువలను పెంపొందిస్తాయి

## కృష్ణాజిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకలైన మహర్షుల్లో ఒకరు. ఆయన రచించిన ఆదికావ్యం శ్రీమద్రామాయణం మన సంస్కృతిలో ధర్మం, న్యాయం, కర్తవ్య నిబద్ధత వంటి విలువలకు మార్గదర్శక గ్రంథమని పేర్కొన్నారు. యుగాలు మారిన కూడా నేటి తరానికి ఆదర్శంగా నిలిచే విధంగా సమాజానికి అందించిన రామాయణ మధుర కావ్యం ఎంతో ఆదర్శవంతమైనదని, మొదటిసారి సంస్కృతంలో శ్లోకాలు రచించినందుకు వాల్మీకి మహర్షిని ఆది కవిగా, రామాయణాన్ని ఆదికావ్యంగా పిలవడం జరిగిందన్నారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి మనిషికి సత్మార్గం, ఆత్మసాక్షాత్కారం, మానవతా విలువల వైపు నడిపించే మార్గంగా నిలుస్తుంది అన్నారు. వాల్మీకి మహర్షి బోధనలు నేటి సమాజంలో సమానత్వం, నీతి, క్రమశిక్షణ, సేవామార్గం వంటి విలువలను పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. మనిషిలో



మార్పు వస్తే మహర్షిగా మారగలరని నిరూపించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన వాల్మీకి మహర్షి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలని, రామాయణం స్ఫూర్తితో కుటుంబ, మానవతా విలువలను పెంపొందించుకొని ధర్మబద్ధంగా జీవించాలని తెలిపారు.

## కలెక్టరేట్లో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వాల్మీకి చిత్రపటానికి పూలమాలను వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ జిల్లా అధికారి జి రమేష్, మెప్మా పీడీ సాయిబాబు తదితరులు భాగస్వాములై వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు.

## కృష్ణాజిల్లా ఎస్పీని కలిసిన ఆకూరి శ్వేత



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకురాలు ఆకూరి శ్వేత జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును, ఎస్పీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వంగా కలిసి మొక్కను అందించారు. త్వరలో జరగబోయే పోలీసుల అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే పలు సేవ కార్యక్రమాలను ఆకూరి శ్వేత జిల్లా ఎస్పీకి వివరించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న బాలునికి పి-4 పథకం కింద చెక్కు అందించిన ఎమ్మెల్యే



**పామర్రు మేజర్ న్యూస్:** అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారిని ఆదుకునేందుకు పి-4 పథకం ద్వారా ముందుకు వచ్చిన దాతను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా అభినందించారు. మొవ్వ మండల కూచిపూడి గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి యార్లగడ్డ శ్యామ్ గ్రోత్ హార్మోన్ సమస్యతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకునేందుకు ఆర్థికంగా సహకారం అందించాలని బాలుని తల్లి కరుణ ఎమ్మెల్యే కుమార్ రాజాను కోరారు. దీనిపై స్పందించిన ఆయన పి-4 పథకం ద్వారా 4వేల రూపాయలు చెక్కును ఆమెకు పార్టీ కార్యాలయంలో అందజేశారు. ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందజేసేందుకు కృషి చేస్తున్నామని, త్వరలో లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయం అందే అవకాశం ఉందన్నారు. ఈ లోపు చికిత్స చేయించుకునేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని దాతల సహకారంతో అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, పార్టీ సీనియర్ నాయకులు గొట్టిపాటి లక్ష్మీ దాసు, పామర్రు మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## చదువును మించిన ఆస్తి లేదు

### ఎన్.ఆర్.ఐ మొవ్వ పూర్ణచంద్రరావు



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** సమాజంలో విద్య యొక్క ప్రాధాన్యతను గుర్తించి తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చి దిద్దాలని ప్రవాస భారతీయులు మొవ్వ పూర్ణ చంద్రరావు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. మండల పరిధిలోని పెనుమత్స మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కుటుంబ సభ్యులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆయన ట్యూషన్ ను ఏర్పాటు చేసి విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులతో కలసి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు వారసత్వంగా ఎక్కువ మొత్తంలో ఆస్తినిచ్చేవారని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆస్తికన్నా విద్యే గొప్పదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పిల్లలకు ఎంత ఆస్తి ఇచ్చామన్నది ముఖ్యం కాదని, ఉన్నత చదువులు చదివించి వారిని జీవితంలో స్థిరపడేలా చేయటమే ముఖ్యమని పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, విద్యాసామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో మొవ్వ స్వరూప రాణి, డాక్టర్ మొవ్వ సుజన, ధర్మ సాగర్, దేవేన్ సాగర్, లేలా సారిక, మొవ్వ రాము, మొవ్వ విజయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఫణి కుమార్, వేణుగోపాలరావు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు ఆటపాటలు కూడా ముఖ్యం



**పెనుగంచిప్రోలు మేజర్ న్యూస్ :** కాకాని వెంకటరత్నం బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం నక్కా బాబురావు చదువుతోపాటు ఆటపాటలు కూడా ముఖ్యమని అన్నారు. మంగళవారం నాడు నియోజకవర్గ స్థాయిలో వివిధ ఆటలకు విద్యార్థులను ఎంపిక చేసే కార్యక్రమం స్థానిక కె.వి.ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల క్రీడా అధికారి వేగినేటి వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో వివిధ ఆట స్థలాలను పాఠశాల కమిటీ చైర్మన్ సముద్రాల రామారావు, ప్రధానోపాధ్యాయులు జలజ, బాబురావు,రమణలు ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు మండలంలోని ప్రైవేటు పాఠశాలల నుండి కూడా ఉపాధ్యాయులు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. మండలంలోని ఉపాధ్యాయులు మాత్రమే కాక జగ్గయ్యపేట వత్సవాయి మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు కూడా ఈ ఆటలు నిర్వహణలో పాల్గొన్నారు. విద్యార్థులతోపాటు ఖోఖో కబడ్డీ, షటిల్ బ్యాట్మెంటన్, చెస్, వంటి ఆటలలో పిల్లల నైపుణ్యాన్ని పరిశీలించి ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బాబు ప్రసాద్, సౌడా నాయక్, రేగండ్ల ప్రభాకర్, పల్లి మురళీకృష్ణ, అజయ్ కుమార్, బి ముక్కంటి, జంగం గౌతమ్, పి గణేష్,లింగాల గోపి, ఎస్ కృష్ణవేణి, కె వినిత, ఉపాధ్యాయులు ప్రసాద్, పుల్లయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.





## ఇస్రో శాస్త్రవేత్త వెంకటేశ్వరరావును మర్యాదపూర్వక కలిసిన ఎమ్మెల్యే

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన పమిడిముక్కల గ్రామంలో ఇస్రో శాస్త్రవేత్త చింతలచెరువు వెంకటేశ్వరరావు స్వగ్రామానికి రాగా ఆయనను స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా మర్యాదపూర్వకంగా కలిశారు. పమిడిముక్కలలోని వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యేను వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి-4 పథకం యొక్క విశిష్టతను వారికి వివరించగా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు సానుకూలంగా స్పందించి తాము కూడా పి-4 లో భాగస్వామ్యం అవుతామని ప్రకటించారు. దీనిపై కుమార్ రాజా హర్షం వ్యక్తం చేస్తూ వారికి తన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు మండల పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, కృష్ణాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపు - ప్రజలకు ఉపశమనం



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం కృష్ణాపురం, కపిలేశ్వరపురం గ్రామాలలో జీఎస్టీ తగ్గింపు పై జరిగిన అవగాహన కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో దుకాణాల వద్దకు వెళ్లి పలువురికి జీఎస్టీ తగ్గింపు పై అవగాహన కల్పించారు అలాగే ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలతో నేరుగా మమేకమైన ఆయన మాట్లాడుత జిఎస్టి తగ్గింపుతో సాధారణ కుటుంబాలకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందన్నారు. ముఖ్యంగా కూలీలు, రైతులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి ప్రజల జీవన వ్యయాలు తగ్గుతాయని తెలిపారు. ఇదే సమయంలో వ్యాపార రంగం ఊపిరి పీలుస్తుందన్నారు. ఉత్పత్తి ఖర్చులు తగ్గడంతో వస్తువుల ధరలు తగ్గి వినియోగదారులకు లాభం చేకూరుతుందని వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజుపాటి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కొల్లిపర బాబి, నాదెళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులతోపాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన ఎమ్మెల్యే



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** పమిడిముక్కల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను పామర్రు శాసనసభ్యులు వరల కుమార్ రాజా అందజేశారు. కపిలేశ్వరపురం గ్రామంలో లంక సీతారామకృష్ణకు 94,094 రూపాయలు మంజూరు కాగా ఆ చెక్కును లబ్ధిదారుని ఇంటికి వెళ్లి కుమార్ రాజా అందజేశారు. మేడూరు గ్రామానికి చెందిన మెరకనపల్లి ఎలీషా కు 50,700 రూపాయలు, ముత్రాసిపాలెం కు చెందిన సుగుణ శ్రీనివాసరావు కు 44,319 రూపాయల చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పమిడిముక్కల గ్రామంలో అందించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, కృష్ణాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ల సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు కొల్లిపర బాబి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రతిభ గల క్రీడాకారులు పల్లెల్లోనే ఉన్నారు

**గన్నవరం, అక్టోబర్ 7, మేజర్ న్యూస్ :** ప్రతిభ గల క్రీడాకారులు పల్లెల్లోనే ఉన్నారని వారిని గుర్తించి ప్రోత్సహిస్తే దేశం గర్వించదగ్గ క్రీడాకారులు గా రాణించగలరని గన్నవరం జడ్ పి సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. గన్నవరం మండల స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య క్రీడలు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం ప్రారంభం సందర్భంగా ఆమె విచ్చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఏ. సునీల అధ్యక్షత వహించారు. ఎలిజబెత్ రాణి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ విద్యార్థులు చదువు తో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇచ్చి సాధన చేయడం ద్వారా ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని సూచించారు. నైపుణ్యం గల క్రీడాకారుల కు సహకారం అందిస్తామన్నారు. క్రీడలలో సాధించిన ప్రగతితో విద్యార్థులు స్పోర్ట్స్ కోటాలో సీట్లు, ఉద్యోగాలు పొందవచ్చునని తెలిపారు. సునీల మాట్లాడుతూ తమ క్రీడా ప్రాంగణం ఉత్తమ క్రీడాకారుల రూపకల్పన కేంద్రం గా వర్ధిల్లుతుందని తెలిపారు. గన్నవరం మండల హీల్ ప్రతినిధి బి. సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయంలో ఆట స్థలంలో సాధన చేసేందుకు కేటాయించాలన్నారు. గన్నవరం మండల క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు మాట్లాడుతూ మూడు రోజుల పాటు మండల స్థాయి లో ఏడు క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి రోజు అండర్ 14,17 బాలికలకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. గన్నవరం మండలం లోని పాఠశాలల నుండి 200 మంది బాలికలు పోటీలకు హాజరైనారని తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని డివిజనల్ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమం లో గన్నవరం సబ్ జోన్ కార్యదర్శి యస్. వెంకటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ మీరా సాహెబ్, సి హెచ్. బాల కృష్ణకే. టాన్య గిరి, బి. శాంతి కిరణ్, కే. విజయ కుమారి పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, లాయర్ పజ్జూరు రామకృష్ణ మృతి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ జి.కొండూరు మండల మాజీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ నేత, ప్రముఖ న్యాయవాది, మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, టీడీపీ జిల్లా లీగల్ సెల్ ప్రతినిధి పజ్జూరు రామకృష్ణ (64) మంగళవారం తుది శ్వాస విడిచారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తెలుగు దేశం పార్టీలో ఆయన విశేషసేవలందించారు. లాయర్ పజ్జూరు రామకృష్ణ మృతి కారణంగా జి.కొండూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన ఎందరికో న్యాయ సలహాలు, సూచనలు ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అభ్యున్నతికి తనవంతు కృషి చేశారు. నేడు స్వగ్రామమైన జి.కొండూరులో మధ్యాహ్నం 2 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## వాల్మీకి రామాయణ కావ్యాన్ని అందించి మేలు చేసారు
### ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ



**గన్నవరం, అక్టోబర్ 7, మేజర్ న్యూస్ :** శ్రీరాముని జీవిత చరిత్రను రామాయణ రూపంలో మానవాళికి అందించిన వాల్మీకి మహర్షి సమాజానికి ఎంతో మేలు చేశారని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కొనియాడారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ శ్రీరాముని జీవిత చరిత్రను రామాయణ కావ్యంగా మలిచి ప్రపంచానికి అందించటం ద్వారా ప్రజలకు నైతిక, మానవీయ, సామాజిక, విలువలు పెంపొందించడంలో వాల్మీకి ఎంతగానో తోడ్పడ్డారని ప్రశంసించారు. తండ్రి మాట జవదాటని శ్రీరాముడు మహారాజు పదవిని తృణప్రాయంగా త్యజించి అడవుల్లో కేగిన ఘన చరిత్రను, ఎన్నికష్టాలు ఎదురైనా సోదరుని బాటలో నడిచిన లక్ష్మణుడి సోదర వాత్సల్యాన్ని చక్కగా వివరించటంతోపాటు సమాజంలో ప్రతి ఒక్కరూ ఇదే రీతిగా మెలగాలని సమాజానికి చాటారని పేర్కొన్నారు. నిజజీవితంలో రామాయణం అనుసరణీయమని ఈ గాథ ప్రభావం భారతీయులందరూ పై ఉంటుందని ఈ సందర్భంగా యార్లగడ్డ పేర్కొన్నారు.

# పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయండి



**పమిడిముక్కల మేజర్ న్యూస్:** మండలంలో పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు సంబంధించిన అన్ని వివరాలను సకాలంలో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, గన్నవరం సహాయసంచాలకులు సునీల్ ఆదేశించారు. పంట నమోదు పూర్తి కాని రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రాధాన్యత ఇవ్వబడదని అధికారులు స్పష్టం చేశారు. కావున పంట నమోదు పనులను త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చేయాలని సూచించారు. మండల పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులతో మండల కేంద్రమైన పమిడిముక్కలలో సమావేశం నిర్వహించారు. పంట నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించారు. పంట నమోదు పూర్తి కాకుండా ఉండడం వల్ల ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. పంట నమోదు పూర్తి కాని రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ప్రాధాన్యత ఇవ్వబడదని అధికారులు స్పష్టం చేశారు. కావున గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామాల్లో పర్యటించి, రైతులను సంప్రదించి, పంట నమోదు ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి పంట నమోదు పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ రైతులను సంప్రదించి, వారి పంట నమోదు వివరాలు నమోదు చేయడంతో పాటు, అవసరమైతే సహాయం అందించాలని వి.ఏ.ఎలను కోరారు. పంట నమోదు ప్రక్రియలో సంబంధిత టెక్నాలజీలను సద్వినియోగం చేసుకోవడం, పొరబాట్లు నివారించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో పంట నమోదు ప్రక్రియ, దాని ప్రాముఖ్యత పై ప్రత్యేకంగా చర్చించారు. పంట నమోదు పూర్తయితేనే రైతుకు సబ్సిడీ, ప్రయోజనాలు, ధాన్యం కొనుగోలులో ప్రాధాన్యత లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు. అందుకు అవసరమైన సాంకేతిక సహాయం, సమాచారం వి.ఎ.ఎ.లకు అందించారు. సమావేశంలో పాల్గొన్న వి.ఎ.ఎ. లు తమ పరిధిలో పంట నమోదు పురోగతి వివరాలను అందించారు. ప్రస్తుత పురోగతిని బట్టి మిగిలిన పనులను అధికారులు సమీక్షించారు. పనులు వేగవంతం కావడానికి సహకరించాలని వి.ఎ.ఎలను కోరారు.

# అత్యుత్తమ గ్రామపంచాయతీగా పెనుగంచిప్రోలు గ్రామపంచాయతీ..




**పెనుగంచిప్రోలు మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లాలో అత్యుత్తమ గ్రామ పంచాయతీ గా పెనుగంచిప్రోలు మేజర్ గ్రామ పంచాయతీ ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.చక్కగా పారిశుధ్య నిర్వహణ,తడి చెత్త, పొడి చెత్త, సేకరణ, రోడ్ల వెంట మొక్కల పెంపకం, రోడ్ల వెంట చెత్త కుప్పలు, పెంట దిబ్బ లు లేకుండా చేయడం, వీధి లైట్ల నిర్వహణ, మంచి నీటి సరఫరా, ఉత్తమ ప్రజా సేవల నిర్వహణ లో పెనుగంచిప్రోలు మేజర్ పంచాయతీ ఎన్టీఆర్ జిల్లా లో అత్యంత ఉత్తమ సేవలు అందించింది.పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి బుధవారం విజయవాడ లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మి షా చేతుల మీదుగా అత్యంత ఉత్తమ ప్రతిభాఅవార్డు అందుకున్నారు. నందిగామ ఆర్ డి ఓ బాలకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారిణి లావణ్య, పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి గొర్రె పాటి శ్యాం కుమార్, ఈ అవార్డు ల కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మి షా మాట్లాడుతూ సర్పంచ్ పద్మకుమారి కి అభినందనలు తెలిపారు.సర్పంచ్ పద్మ కుమారి మాట్లాడుతూ ఈ అవార్డు పవిత్ర పుణ్య క్షేత్రమైన పెనుగంచిప్రోలు గ్రామ ప్రజలకు అంకితం ఇస్తున్నానని చెప్పారు.పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు, మండల ఎం పి డి ఓ, శ్రీను, ఈ ఓ పి ఆర్ డి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శిగొర్రె పాటి శ్యాం,సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ప్రజలు అందించినసహాయ సహకారం తో పెనుగంచిప్రోలు గ్రామాన్ని ఆదర్శం గా తీర్చి దిద్దా మని అన్నారు... పెనుగంచిప్రోలు కు ఉత్తమ అవార్డు రావడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ పద్మ కుమారి కి అభినందనలు తెలుపుతున్నారు.

# నాగవరం సమస్యల పరిష్కారంకు జిల్లా కలెక్టర్ గ్రామస్తులకు హామీ

**గుడ్లవల్లేరు, గూడూరు మండలాల్లోని నాగవరం గ్రామస్తులతో, అధికారులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి**



**గుడ్లవల్లేరు అక్టోబర్ 7 మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు, గూడూరు మండలాల్లో మిళితమైవున్న నాగవరం గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ గుడివాడ నియోజకవర్గం గుడ్లవల్లేరు మండలం వేమవరం పంచాయతీ, పెడన నియోజకవర్గం గూడూరు మండలం ముక్కొల్లు పంచాయతీ సరిహద్దులో ఉన్న నాగవరం గ్రామాన్ని సందర్శించారు. అక్కడి గ్రామ ప్రజలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగవరం గ్రామస్తులు మాట్లాడుతూ రెండు నియోజకవర్గాలు రెండు మండలాలు రెండు గ్రామపంచాయతీలలో నాగవరం గ్రామం సరిహద్దు గ్రామంగా ఉండడంతో తాము ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాగవరం గ్రామం ఒకవైపు గుడ్లవల్లేరు మండలం వేమవరం పంచాయతీ పరిధిలో 250 మంది జనాభా ఉన్నారని, మరోవైపు గూడూరు మండలం ముక్కొల్లు పంచాయితీ పరిధిలో 169 మంది జనాభా ఉన్నారన్నారు. ముక్కొల్లు పంచాయతీలో మొత్తం1429 మంది జనాభా ఉన్నారన్నారు. ముఖ్యంగా అక్కడ ఉన్న మంచినీటి పథకం ద్వారా రెండు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తున్న అందరికీ సరిపోవటం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చారు. గ్రామ మొదటిలో ఉన్న శివాలయం నుండి గ్రామం లోపలికి రావడానికి చీకటిగా ఉండటం విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు మనవి చేశారు. అంతేకాకుండా సరైన రహదారి లేకపోవడంతో వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బంది కలుగుతుందన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడుతూ నాగవరం గ్రామంలోని ప్రజలు గ్రామసభ నిర్వహించుకుని వారి కోరిక మేరకు అందరూ గుడ్లవల్లేరు మండలం వేమవరం పంచాయతీలో ఉంటామనేటట్లుగా సానుకూలంగా తీర్మానాలు చేసి పంపిస్తే, వాటిని మండల పరిషత్, జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశాల్లో ఆమోదించుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. ప్రభుత్వం నుండి ప్రతిపాదనలు ఆమోదించేటట్లుగా అన్ని విధాలా కృషి చేస్తామన్నారు. సరిహద్దు సమస్య లేకుండా ఆ విధంగా పరిష్కరిస్తామన్నారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపీడీవోలకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో మంచినీటి కోసం ప్రస్తుతం ఉన్న చిన్న పైపులైనుకు అదనంగా మరో పైపులైను ఏర్పాటు చేసి గ్రామస్తులకు సరిపడే విధంగా నీటిని సరఫరా చేయిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో 2.5 కిలోమీటర్ల మేరకు సరైన రహదారి ఏర్పాటు చేయిస్తామని జిల్లా కలెక్టర్ గ్రామస్తులకు హామీ ఇస్తూ సిమెంటు రోడ్లు, తారు రోడ్లు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. అలాగే గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వీధి దీపాలు ఏర్పాటు విషయమై సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని కలెక్టర్ చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రభుత్వం తరపున అన్ని పనులు చేయిస్తామని గ్రామస్తులు చెత్తాచెదారాలను ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి గ్రామపంచాయతీ సిబ్బందికి అందజేసి స్వచ్ఛఆంధ్ర ఉద్యమానికి సహకరించాలని కోరారు. తదనంతరం గ్రామస్తులందరూ జిల్లా కలెక్టర్ తమ గ్రామానికి వచ్చి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినందుకు అందరూ హర్షధ్వానాల మధ్య కలెక్టర్కు ధన్యవాదాలు తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డ్వామా పిడి శివప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ ఈ రమణ రావు, ఆర్డబ్ల్యూఎస్ ఈ సోమేశ్వరరావు, ఈఈ నటరాజు గుడ్లవల్లేరు, గూడూరు ఎంపీడీవోలు ఇమ్రాన్, శైలజ, నాగవరం సర్పంచ్ పద్మావతి, పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు నాగవరం ముక్కొల్లు పంచాయతీ కార్యదర్శులు దుర్గా నాగమల్లేశ్వరరావు, బాపూజీ, ఏఎన్ఎం ప్రభావతి పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముస్సిపల్ స్థలం అమ్ముకున్న దొంగ బొడ్డు వేణు

**పెడన, మేజర్ న్యూస్ :** సోమవారం బ్రహ్మపురం దేవాంగ కళ్యాణ మండపంలో కలంకారి కార్మికుల ఉమ్మడి సమావేశంలో స్థల బదలాయింపుల్లో అడ్డుకున్న వైసిపి కౌన్సిలర్లు అని బ్యానర్ పై టిడిపి నాయకులు హెడ్డింగు పెట్టారని చెబుతూ అసలు కలంకారి కార్మికుల కోసం చైర్ పర్సన్ ను గాని పాలకవర్గాన్ని గాని టిడిపి నాయకులు అసలు కలిసారా అని ప్రశ్నిస్తూ బొడ్డు వేణుగోపాలరావు అధికారంలో ఉన్నప్పుడు మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన 18 సెంట్లు స్థలాన్ని అమ్ముకున్నారని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు నిగ్గు తేల్చింది నిజం కాదా అని వైసిపి కౌన్సిల్ సభ్యుడు గరికిముక్కు చంద్రబాబు ఆరోపించారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైసీపీ కౌన్సిల్ సభ్యులు పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మున్సిపల్ వైసిపి కౌన్సిల్ సభ్యుడు చంద్రబాబు మాట్లాడుతూ కలంకారి పరిశ్రమ కోసం ఎన్నికల ముందు పట్టణానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బహిరంగ సభలో మాట్లాడుతూ కలంకారి పరిశ్రమ కోసం సుమారు 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని పరిశ్రమ నాయకులు కోరారని బహిరంగ సభలో మాట్లాడింది నిజం కాదా అని తన ఫోన్ ద్వారా ఆ సభలో మాట్లాడిన విషయాలను బహిర్గతం చేశారు. ఇప్పుడు కలంకారీ క్లస్టర్ కోసం పేద మున్సిపాలిటీ యొక్క స్థలాలను కేటాయించమని అడగటం సిగ్గుచేటు అన్నారు. ఇటువంటి పేద మున్సిపాలిటీకి సంబంధించిన 18 సెంట్లు అమ్ముకున్న బొడ్డు వేణుగోపాలరావు మున్సిపాలిటీ దొంగ అవుతావని తెలిపారు. ఆ 18 సెంట్లు అమ్ముకున్నది తానేనని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు నిగ్గు తేలిచారని పేర్కొన్నారు. దీనిపై తాను నోటీసులు తీసుకుంది నిజం కాదా అని బహిరంగ చర్చకు సిద్ధం అని పిలుపునిచ్చారు. అనంతరం కౌన్సిల్ సభ్యుడు మెట్ల గోపి ప్రసాద్ మాట్లాడుతూ కలంకారి క్లస్టర్ కోసం అనేక శాఖల నుండి అనుమతులు కావాలని అటువంటి అనుమతులు ఏమీ లేకుండా పొల్యూషన్ బోర్డ్ వాటర్ డిపార్ట్మెంట్ ఇలా దీనికి సంబంధించినవి అనేకం ఉంటాయని ఇవేమీ లేకుండా కష్ట నిర్మాణం కోసం స్థలం అడగటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పథకాలు దీపం పథకం పై ఎంత మంది లబ్ది పొందుతున్నారు నిగ్గు తేల్చాలని కోరారు. మున్సిపాలిటీకి సంబంధించిన స్థనాలు ఎమ్మెస్ ఎం కి బదులాయించడానికి మీరు ఎవరని మీకు ఏం హక్కు ఉందని ప్రశ్నించారు. ఇటీవల ప్రభుత్వం నుండి టిసిఎస్ లాంటి పెద్ద కంపెనీకి లబ్ధి చేకూర్చింది నిజం కాదా అని చెబుతూ అంత ప్రేమ వలకబోసే కలంకారి కార్మికుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా స్థలాన్ని ఎందుకు కేటాయించలేకపోతుందో సమాధానం చెప్పాలని కోరారు అసలు కలంకారీ క్లస్టర్ కోసం ఎపిక్ సంస్థకు దరఖాస్తు చేస్తే దానిని పరిశీలించి ఎం ఎస్ ఎం కి పంపుతారని ఇది కూడా వారికి తెలియదా అని చెబుతూ ఇది



టిడిపి ట్రస్టర్లా ఉంది గాని కార్మికుల కోసం నిర్మించే కస్టర్ల లేదని అసలు క్లస్టర్ అంటే కెమికల్ క్లస్టర్ న్యాచురల్ కస్టరా పెన్ కలంకారి క్లస్టర్ ఏంటిదో స్పష్టత ఇవ్వాలని అన్నారు. ప్రముఖ కలంకారి వ్యాపారవేత్త బల్ల ప్రసాదు తన వద్ద ఎంతమంది పనిచేస్తున్నారని లేబర్ యాక్ట్ ప్రకారం వారికి వేతనాలు ఎంత ఇస్తున్నారో బహిరంగంగా చెప్పాలని కోరారు. అంతేగాక తన వద్ద పనిచేస్తున్న కార్మికులకు తెల్లవారుజామునే ఒక వ్యానులో భారీగా కలంకారి గుట్టలను వేసి వారికి రక్షణ లేకుండా వెళ్ళమని చెప్పటం వారి భద్రతకు తాను బాధ్యత వహిస్తాడా అని ప్రశ్నించారు. మరొక కౌన్సిల్ సభ్యుడు కటకం ప్రసాద్ మాట్లాడుతూ గుడ్డు వేణుగోపాలరావు బీసీ కార్పొరేషన్ చైర్మన్గా ఉన్నప్పుడు ఒక్క బీసీ కైనా లోన్ ఇచ్చారా అని ప్రశ్నించారు వారికి ఎవరికైనా న్యాయం చేశారా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కలంకారి అంటేనే పెడలలో స్థాపించిన ప్రధమ ఏకైక వ్యక్తి పిచ్చుక వీరకోట సుబ్బయ్య అని ఆ మహనీయుని ముందుగా గుర్తు తెచ్చుకోవాలని సంగతి కూడా వారికి తెలియకపోవటం సిగ్గుచేటు అన్నారు. చేనేతకు ప్రసిద్ధి చెందిన పెడన పట్టణంలో ఊరికి ప్రప్రదముగా చేనేత లోగోను ఏర్పాటు చేస్తాం స్థలం కేటాయించని పిచ్చుక ఫణి కుమార్ మరి కొంతమంది పెద్దలు కోరగా దానిపై ప్రస్తుత జనసేన కౌన్సిల్ సభ్యురాలు డీసెంట్ ఇవ్వటం ఇప్పుడు కలంకారి కార్మికులపై ముసలి కన్నీరు కార్చడం రాజకీయ లబ్ధికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. సోమవారం జరిగిన బహిరంగ సభలో వారిని ఓడిద్దామా ఓడిద్దామా అని పదేపదే అన్న బొడ్డు వేణుగోపాలరావు తమ వైసిపి కౌన్సిల్ సభ్యుడు చేతిలో ఓడిపోయింది నిజం కాదని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కాజా మాట్లాడుతూ పేద మున్సిపాలిటీ స్థలాలను కలంకారి క్లస్టర్ కోసం బొడ్డు వేణుగోపాలరావు అడగటం అధికార పార్టీ అయ్యుండి స్థలం కేటాయించలేక పేద మున్సిపాలిటీ నుండి స్థలాన్ని అడగటం హాస్యస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన 6:30 ఎకరాలలో సుమారు రెండున్నర ఎకరాలు పేదలకు ఇళ్ల పట్టాలను రిజిస్టర్ చేసి ఇస్తే దానిని రద్దు పరచకుండా ఇటు రెవెన్యూ అధికారులు కలెక్టర్ దానిని కలంకారి కష్టాల కోసం కేటాయించమని ఎలా అడుగుతారు అని ప్రశ్నించారు. గతంలో పాయికానాగా ఉన్న ప్రభుత్వ భూమిలో సచివాలయం అంగనవాడి భవనాన్ని నిర్మిద్దాం అంటే అది పాయకానాస్థలం కాదని స్మశాన వాటిక స్థలమని అడ్డుకున్నది బొడ్డు వేణుగోపాలరావు కాదా అని ప్రశ్నించారు. ఆర్ఎస్ఆర్ రికార్డులలో అది పాయకానా గానే ఉందని స్పష్టం చేశారు. అంతేగాక తాను అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్టర్లను ఇంటికి పిలిపించుకుని కమిషన్లు గుంజుకున్నది నిజం కాదా అని చెబుతూ, కమిషన్ల కోసం కాంట్రాక్టర్లను వేధిస్తున్నామని తమపై నింద వేయడానికి బహిరంగ చర్చకు సిద్ధమని మా వద్ద సాక్షాధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. 1 వార్డు కౌన్సిల్ సభ్యురాలు పద్మావతి బహిరంగ సభలో మాట్లాడుతూ దేవాంగల గురించి కాజాకు ఏమో తెలుసు అన్నారని అసలు కులాలు మతాల గురించి నేను మాట్లాడలేదని తాను దీనిని గ్రహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కౌన్సిల్ సభ్యులు కటకం ప్రసాదు గరిక ముక్కు చంద్రబాబు పిచిక సతీష్ బాబు మున్సిపల్ వైస్ చైర్మన్ కాజా, బాబూలాల్ సిరివెళ్ల జయేష్ కోమట్ల అనిల్ చిన్నారావు, తదితరులు ఉన్నారు.

## చిక్కవరం గ్రామంలో బుక్ కీపర్ అవినీతి

ఎమ్మెల్యే కార్యాలయంలో ఫిర్యాదు



**గన్నవరం, అక్టోబర్ 7, మేజర్ న్యూస్ :** గన్నవరం మండలం చిక్కవరం గ్రామంలో సమత గ్రామైక్య సంఘం బుక్ కీపర్ అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మహిళా సంఘ సభ్యులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. డ్వాక్రా సంఘాల సభ్యుల వివరాల ప్రకారం, ఆ గ్రామంలోని బుక్ కీపర్ పీకా నరసమ్మ గత కొన్నేళ్లుగా వెలుగు కార్యాలయ సిబ్బంది అండతో నిబంధనలకు విరుద్ధంగా అధిక వడ్డీల రూపంలో మహిళా గ్రూపుల వద్ద నుంచి నగదు వసూలు చేస్తోందని ఆరోపించారు. శ్రీనిధి, ఇతర రుణాలు మంజూరు చేయించడానికి కూడా నగదు డిమాండ్ చేస్తుందని, అడిగితే పై అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించేదని వారు తెలిపారు. తన కుటుంబ సభ్యులు తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకుండా, ఆ భారాన్ని ఇతర గ్రూపులపై మోపుతుందని మహిళలు వాపోయారు. బుక్ కీపర్ అవినీతి, దుర్వినియోగాన్ని ప్రశ్నించిన మహిళలపై దాడులు చేయడం, అసభ్య పదజాలంతో తిట్టడం, పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసులు నమోదు చేయించడం వంటి వేధింపులకు పాల్పడిందని వారు ఫిర్యాదు చేశారు. వెలుగు కార్యాలయంలో సీసీ, కంప్యూటర్ ఆపరేటర్ సైతం బుక్ కీపర్‌తో కుమ్మక్కై అవినీతి కప్పిపుచ్చడంలో పాలుపంచుకుంటున్నారని వారు ఆరోపించారు. "రాజకీయ నాయకులు తన వెనుక ఉన్నారని, ఎన్ని ఫిర్యాదులు చేసినా తనకు ఏమీ కాదని బుక్ కీపర్ సవాల్ చేస్తున్నట్లు" మహిళలు తెలిపారు. ఈ అవినీతి ఘటనపై బుక్ కీపర్ పీకా నరసమ్మతో పాటు సంబంధిత వెలుగు సిబ్బందిపై దర్యాప్తు జరిపి తగు చర్యలు తీసుకోవాలని చిక్కవరం సమత గ్రామైక్య సంఘ సభ్యులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎంపీడీవో, వెలుగు ఏపీఎం లకు విజ్ఞప్తి చేశారు.



## పైడమ్మ అమ్మవారి పాలకమండలి నియామకం

**పెడన,మేజర్ న్యూస్:** పట్టణ ప్రజల ఇలవేలుకు గ్రామదేవత శ్రీ పైడమ్మ అమ్మవారి పాలకమండలి నియామకం జరిగిందని ఆలయ కార్య నిర్వహణ అధికారి గోవాడ వెంకట కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నుండి వచ్చిన ఇతరుల కాపీలను ఆలయంలో సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి జాతర మహోత్సవాలకు పాలకమండలి ప్రత్యేక శ్రద్ధ పెట్టి కృషి చేయాలని కోరామన్నారు. అనంతరం టిడిపి పట్టణ అధ్యక్షుడు శ్యామలయ్య మాట్లాడుతూ శాసనసభ్యుల ఆదేశాల మేరకు ప్రభుత్వం నియమించిన పాలకమండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తూ జాతర మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సభ్యులను కోరారు అనంతరం సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, చందన నారాయణరావు, ఎర్ర రాజా, జనసేన కౌన్సిల్ సభ్యురాలు మట్ట శివపామని తదితరులు ఉన్నారు.

## కొండలమ్మ సన్నిధిలో చండీ హోమం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్:** మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో పౌర్ణమి సందర్భముగా మంగళవారం రుద్ర సహిత చండీ హోమాన్ని వేద మంత్రోచ్ఛరణ నడుమ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రుద్రపాక శరశ్చంద్ర శివ సంతోష్ వేద పండితుల బందం ఈ హోమాన్ని చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించకుని తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో కష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకష్ణయ్య, దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోమోటివ్ ట్రేడ్‌పై ముగిసిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్



**గుడ్లవల్లేరు అక్టోబరు 07 మేజర్ న్యూస్ :** మండలంలోని కౌత వరం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు గుడ్లవల్లేరు శ్రీ లక్ష్మీ మెకానిక్ వర్క్స్ లో ఆ సంస్థ అధినేత సిహెచ్.ఉపేంద్ర ఆటోమోటివ్ ట్రేడ్‌పై ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రాక్టికల్ శిక్షణ మంగళవారంతో ముగిసింది. సమగ్ర శిక్షా కార్యక్రమం కింద తమ 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆటోమోటివ్ ట్రేడ్‌పై హెచ్‌ఎమ్ ఆదేశాలతో 10రోజుల ఇంటర్న్‌షిప్ నిర్వహించామని జీసీడీఓ ఒకేషనల్ ట్రైనర్ నిమ్మకూరి శ్రీనివాసరరావు తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థులు ఆటోమొబైల్ రంగానికి చెందిన ప్రాథమిక సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకున్నారని చెప్పారు.

## కొండలమ్మను దర్శించుకున్న న్యాయ సేవాధికార కార్యదర్శి



**గుడ్లవల్లేరు అక్టోబరు 07 మేజర్ న్యూస్ :** మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని కష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకష్ణయ్య మంగళవారం దర్శించుకున్నారు. వారికి దేవస్థాన ఈఓ ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు ఆలయ మర్యాదలతో సాదరంగా స్వాగతం పలికి సన్మానించి అమ్మవారి చిత్ర పటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత వారి పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలను ఒనరించారు.

# కొరమీను చేపల సాగుతో రైతుకు అదనపు ఆదాయం

## కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వ్యవసాయంతో పాటు అనుబంధంగా కొరమీను చేపల సాగు చేయడం వల్ల రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జీవనోపాదుల మెరుగుదలపై జిల్లా కలెక్టర్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్ తో కలిసి మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ,పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, పరిశ్రమలు, మత్స్య, పశుసంవర్ధక, సాంఘిక సంక్షేమం, ఎంపీడీవోలు తదితర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొరమీను చేపలను తక్కువ స్థలంలోనే పెంచవచ్చని, మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో, తక్కువ పెట్టుబడితో లాభదాయకంగా ఉంటుందన్నారు. ఉదయ్ ఆక్వా కంపెనీతో ఒప్పందం చేసుకున్నామని, అవసరమైన సీడ్ సరఫరాతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. ఎకరం లేదా రెండు ఎకరాలు కలిగిన చిన్న రైతులు 10 సెంట్ల స్థలంలో చెరువును తవ్వుకొని సాగు చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ కింద అవసరమైన వారికి సబ్సిడీతో కూడిన రుణాలను అందిస్తుందన్నారు. ప్రస్తుతం గుర్తించిన ఆసక్తి గల 100 మంది రైతులకు డీపీఆర్లను పరిశీలించి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారు చేసే లక్ష్యంలో భాగంగా, ఇప్పటికే ఉన్న వ్యాపారాలను విస్తరింప చేయదలచుకున్న వారికి అదనపు ఆర్థిక సహకారం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎంఈజీపి, వెలుగు పథకాల ద్వారా రుణాలు అందించడం జరుగుతుందని, అర్హత గల వారిని గుర్తించి ప్రోత్సాహం అందించాలన్నారు. జిల్లాలో అధిక పాల ఉత్పత్తికి కృషి చేయాలని అధికారులకు సూచిస్తూ, లింగ నిర్ధారిత పిండముల అభివృద్ధిపై ఆరా తీశారు. పథకం కింద లబ్ధిదారుడు కొనుగోలు చేసిన పశువులకు తప్పనిసరిగా బీమా చేయించాలన్నారు. పశువులను కొనుగోలు చేయకుండా ఇతరులు కొనుగోలు చేసిన పశువులను చూపిస్తూ పథకం రాయితీలను పొందే వారిని నిరోధించాలని సూచించారు. సమావేశంలో డిఆర్డిఏ, మెప్మా పీడీలు హరిహరనాథ్, సాయిబాబు, జెడ్పి డిప్యూటీ సీఈవో ఆనంద కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి చిన్న నరసింహులు, మత్స్య, ఉద్యాన శాఖల అధికారులు నాగరాజ, జె జ్యోతి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి షాహిద్ బాబు, ఎంపీడీవోలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.



# వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** కృష్ణా నది వరద ప్రభావిత ప్రాంతమైన పాత ఎడ్లంక గ్రామానికి చెందిన 450 మంది బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక రెండవ వార్డ్ లోని బేతేల్ చర్చి ఆవరణలో రేవ బొండాడ పాల్ మేయర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైదరాబాదుకు చెందిన విశ్వ ప్రగామి ట్రస్ట్ సమకూర్చిన నిత్యవసర సరుకులను నిర్వాహకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రదర్ పాల్ మేయర్ పాత ఎడ్లంక వరద పరిస్థితులను తెలియజేసి సహాయం చేయవలసిందిగా కోరారని తొలుత దీవి ప్రాంతంలో ఉన్న వారికి సహాయం చేయాలి అనుకున్నప్పటికీ నదికి ఇటువైపున ఉన్న ప్రాంతం కూడా వరద ప్రభావానికి గురైందని తెలియడంతో వారికి కూడా నిత్యవసర సరుకులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఏఎమ్ ఎఫ్ మోజెస్ బెనెడిక్ట్, స్టేట్ కోఆర్డినేటర్ జి.స్టీఫెన్, వి పరంజ్యోతి వై మధు, జి సురేష్ బి జార్జ్ ముల్లర్, పాత ఎడ్లంక గ్రామస్తులు పాలెపు వెంకటేశ్వరరావు, కొల్లూరు వాసు తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీమ్ కోర్ట్ జడ్జిపై దాడి అంటే దేశ గౌరవంపై దాడి... కర్రా సునిల్ కుమార్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సుప్రీమ్ కోర్ట్ లాంటి మహత్తరమైన సంస్థకు నాయకత్వం వహిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై దాడి కేవలం వ్యక్తిగత దాడి కాదు, ఇది భారత రాజ్యాంగం మీద దాడి, ప్రజాస్వామ్యం మీద దాడి, న్యాయ వ్యవస్థపై జరిగిన అవమానం ! న్యాయస్థానం స్వతంత్రంగా ఉంటేనే ప్రజాస్వామ్యం నిలుస్తుంది. న్యాయమూర్తి గౌరవం కూలిపోతే,దేశ ప్రతిష్ఠ కూలిపోతుంది. ఇలాంటి వికృతి చేష్టలను ప్రతి భారతీయుడు ఖండించాల్సిన అవసరం ఉంది అని ఎ.పి.ఎస్.సి వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణాజిల్లా ప్రెసిడెంట్ కర్రా.సునిల్ కుమార్ తెలిపారు.

# సుప్రీం ప్రధాన న్యాయమూర్తి మీద దాడి అమానుషం

## మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవ్యవస్థ పవిత్రమైన, సర్వోన్నత ఉన్నత స్థాయి వ్యవస్థ. రాజ్యాంగ వ్యవస్థకు రక్షకుడు, అధిపతిగా నిలిచే భారత ప్రధాన న్యాయమూర్తిపై దాడి, న్యాయవ్యవస్థ నిష్పాక్షికతను ప్రశ్నార్థకం చేయడమేకాక ప్రజాస్వామ్య విలువలపై నేరుగా జరిపిన దాడిగా పరిగణించాలి అని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు.మంగళవారం మచిలీపట్నంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ దాడిపై దేశవ్యాప్తంగా ఉన్న బార్ లు భగ్గుమని తీవ్రంగా ఖండించడం హర్షణీయం అన్నారు.దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని భారసోసియేషన్లు విధులు బహిష్కరించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అండగా నిలిచాయని బాలాజీ అన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన దాడిని రాజ్యాంగంపై జరిగిన దాడిగా అభివర్ణిస్తుందిని న్యాయవాదులందరూ దీన్ని ముక్తకంఠము తో ఖండిస్తున్నారని బాలాజీ తెలియజేశారు.దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయమూర్తుల తీర్పులే కీలకంగా నిలుస్తాయి. వీరిని భయపెట్టే ప్రయత్నం చేయడం, స్వేచ్ఛా న్యాయవ్యవస్థను కూల్చే ప్రయత్నమే. ఇలాంటి నీతిబాహ్యమైన చర్యలపై న్యాయమూర్తులకు న్యాయవాదులు బాసటగా నిలవడమే కాక న్యాయవ్యవస్థను సంరక్షించే యోధులుగా నిలుస్తారు అని దీనిపై పెద్దఎత్తున బార్ అసోసియేషన్లు ఏకతాటిపై ఐక్యత ప్రదర్శించి నిరసనలు వ్యక్తం చేయడం ప్రశంసనీయం అని బాలాజీ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థపై గౌరవం తగ్గిన నాడు ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ కుప్పకూలిపోతాయిఅని న్యాయమూర్తుల స్వతంత్రతను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత. ఇటువంటి చర్యలు న్యాయ వ్యవస్థ యొక్క స్వతంత్రతను, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. బార్ అసోసియేషన్లు ఈ ఘటనపై తక్షణం స్పందించి ప్రజాస్వామ్య మూలాలు చెదరకుండా న్యాయమూర్తుల రక్షణకు వారికి బాసటగా నిలవడం అభినందనీయంఅని లంకిశెట్టి అన్నారు. ప్రజలు అంతిమంగా ఆధారపడాల్సిన వ్యవస్థ న్యాయ వ్యవస్థే అని వాటికి రక్షణ లేని నాడు ప్రజాస్వామ్య వ్యవస్థలు నిర్వీర్యమవుతాయి అని బాలాజీ అన్నారు. సోషల్ మీడియాలో వచ్చినట్లుగా ప్రధాన న్యాయమూర్తి హిందువుల మనోభావం దెబ్బతీసే విధంగా భగవంతుడిని కించపరిచే వ్యాఖ్యలు చేసి ఉన్నట్లయితే అవి రికార్డు నుంచి తొలగించవలసిన అవసరం ఎంతైనా ఉందని బాలాజీ అన్నారు.



# మల్లెల మహేష్ రెడ్డికి ఎమ్మెల్యే ఘన నివాళి

**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** 17వ డివిజన్ మాజీ బూత్ కన్వీనర్ మల్లెల మహేష్ రెడ్డి చిత్రపటానికి విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ మోహన్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మంగళవారం స్థానిక టీడీపీ డివిజన్ పార్టీ కార్యాలయంలో మహేష్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటు పలువురు నివాళులర్పించి మాట్లాడారు. మహేష్ రెడ్డి పార్టీ కార్యక్రమాల్లో ఎంత చురుకుగా పాల్గొనేవాడో గుర్తు చేసుకున్నారు. చిన్న వయస్సులతో హఠాన్మరణం చెందడం అతని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పాటు డివిజన్ లోని ప్రతి టీడీపీ కార్యకర్తకు ఎంతో దుఖాన్ని మిగిల్చిందన్నారు. అతని కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు ఆత్మస్థైర్యాన్ని మరింతగా ఇవ్వాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ అధ్యక్షురాలు రాయి రంగమ్మ అధ్యక్షతన సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ 18వ డివిజన్ అధ్యక్షులు వేముల దుర్గారావు, సీనియర్ నాయకులు పగడాల వెంకటేశ్వర రావు, 17, 18వ డివిజన్ బూతు కన్వీనర్లతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారత న్యాయమూర్తి పై జరిగిన దాడి దేశ వ్యవస్థలపై జరిగిన దాడే : దోవా గోవర్ధన్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ ఆర్ గవాయ్‌పై జరిగిన దాడి దేశ వ్యవస్థలపై జరిగిన దాడిగా భావించి కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గోవా గోవర్ధన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ ఓ మతోన్మాది తన కాలి బూటు విసిరిన హేయమైన చర్య మన దేశాన్ని ప్రపంచం ముందు తల వంపులకు గురి చేసిందని అన్నారు. ఈ ఘటనను భారతీయ పౌరులుగా రాజ్యాంగ పరిరక్షకులుగా పూర్తిస్థాయిలో ఖండిస్తున్నామన్నారు. సుప్రీంకోర్టులో రాకేష్ కిషోర్ అనే ఒక వ్యక్తి లాయర్‌గా పని చేస్తూ ఆ న్యాయ వ్యవస్థలపై నమ్మకం చూపించకుండా బుద్ధి మందగించిన పనులు చేస్తూ ఇలాగే సనాతన ధర్మాన్ని రక్షిస్తున్నానంటే అది ఆ ధర్మానికి అపకీర్తి తేవడమేనని గోవర్ధన్ అన్నారు. ఈ దేశంలో ఇప్పుడు నడుస్తున్నది భారత రాజ్యాంగ బద్ధమైన ధర్మం, ఇక్కడ అందరూ సమానులుగా జీవించడానికే చట్టాలు రూపొందించబడ్డాయి అని దానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడిన వారు నిజమైన దేశద్రోహులు అవుతారని ఆ విధంగా ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించి దోషిని కఠినంగా శిక్షించకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కృష్ణాజిల్లా మాల మహానాడు తరపున హెచ్చరించారు.

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా పీ.యుగంధర్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ పి.యుగంధర్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు అనంతపురం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న యుగంధర్‌ని పదోన్నతి పై కృష్ణాజిల్లా డిఎంహెచ్ఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999